

గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

వరద ఆలస్యం



కృష్ణా నదికి స్వల్పంగా వస్తున్న వరద

- వర్షాలు కురవకపోవడంతో కృష్ణా బేసిన్‌లో తగ్గుతున్న నీటి లభ్యత
- వరద ఎక్కువ వచ్చిన సంవత్సరాల్లోనూ నిల్వ చేసుకోలేని దుస్థితి
- జూలై మొదటి వారానికీ ఆలమట్టి ప్రాజెక్టులో సగానికి కూడా చేరుకోని నీటిమట్టం
- శ్రీశైలానికి గతేడాది అత్యల్పంగా 145 టీఎంసీలు మాత్రమే వరద
- నాలుగు దశాబ్దాల్లో 2015లో అత్యల్పంగా 74 టీఎంసీలు మాత్రమే రాక
- వరద ఎక్కువ వచ్చిన సంవత్సరాల్లో నీరంతా సముద్రంలోకి విడుదల

మహబూబ్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మరో వరద సీజన్ ఆరంభమైంది. కృష్ణమ్మ వరద ఆలస్యమవుతోంది. ఎగువన ఉన్న ఆలమట్టి రిజర్వాయర్ నీటిమట్టం జూలై మొదటి వారం వచ్చినా సగానికి కూడా చేరుకోలేదు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలు చెబుతున్నప్పటికీ వరద ఆలస్యమవుతుండటంతో వానాకాలం పంటల సాగు చేపడుతున్న రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఎగువన వర్షాలు కురిస్తేనే కృష్ణా బేసిన్ పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన ప్రాజెక్టులకు ఉపయోగకరంగా ఉంటుంది. గతేడాది వరద ఆలస్యం కావడం, తర్వాత నెలల్లో వరద వచ్చినా ఎగువన నీటి వాడకం పెరగడంతో దిగువకు అత్యంత తక్కువగా నీరు వచ్చిందని చెప్పవచ్చు. అయితే వర్షాలు కురవని కారణంగా కృష్ణా బేసిన్ పరిధిలో నీటి లభ్యత తగ్గుతోంది. గతేడాది శ్రీశైలం ప్రాజెక్టుకు 145 టీఎంసీల వరద మాత్రమే రావడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా బేసిన్‌లో 811 టీఎంసీల నీటి కేటాయింపు ఉన్నది. ఇందులో ఎక్కువగా ఎగువన ఉన్న కర్ణాటక నుంచి రావాల్సిందే. ఆలమట్టి రిజర్వాయర్‌లోకి సీజన్ ప్రారంభంలోనే భారీ వరదలు వచ్చి నిండితే తప్పా దిగువకు నీరు వచ్చే అవకాశం ఉండదు. కానీ, ఈ ఏడాది ఇప్పటివరకు ఆలమట్టిలో నీటిమట్టం సగానికి కూడా చేరుకోలేదు. దీంతో ఈ సంవత్సరం వరద నీరు తక్కువగా వస్తుందనే ఆందోళన నెలకొన్నది. ఎగువన ఉన్న కర్ణాటకలో ప్రధాన ప్రాజెక్టులైన ఆలమట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు నిండిన తర్వాతనే తెలుగు రాష్ట్రాల్లో మొదటి ప్రాజెక్టు అయిన జూరాలకు వరద వస్తుంది. ఇప్పటికే నారాయణపూర్ రిజర్వాయర్ దిగువన కురిసిన వర్షాలతో జూరాల ప్రాజెక్టు నిండిపోగా శ్రీశైలం ప్రాజెక్టు నిండటమే రెండు తెలుగు రాష్ట్రాలకు కీలకంగా చెప్పవచ్చు. అయితే గత వాటర్ ఇయర్‌లో శ్రీశైలానికి కేవలం 145 టీఎంసీలే రాగా ఇప్పటివరకు కృష్ణా బేసిన్‌కు వచ్చిన అత్యంత తక్కువ నీరు వచ్చిన సంవత్సరాల్లో రెండోదిగా చెప్పవచ్చు.

ఆ సమయంలో సముద్రంలోకే..

కృష్ణా బేసిన్‌లోని రెండు తెలుగు రాష్ట్రాలకు శ్రీశైలం కీలక ప్రాజెక్టుగా చెప్పవచ్చు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చి నాలుగు దశాబ్దాలు గడుస్తోంది. మొదటి రెండు దశాబ్దాల్లో వరద నీరు ఎక్కువగానే రావడంతో నీటి లభ్యత కూడా అధికంగానే ఉన్నది. కానీ, రానురాను నీటి లభ్యత తగ్గుతూ వస్తోంది. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత ఎక్కువగా ఉన్నప్పుడు వినియోగం సరిగా లేకపోవడం, నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం లేకపోవడం, ఒక సంవత్సరంలో వచ్చిన వరదను మరో సంవత్సరానికి క్యారీ ఓవర్ స్టోరేజీ కింద వాడుకోలేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎక్కువ వరద వచ్చినప్పుడు నేరుగా సముద్రంలోకి వదిలేయడంతో సాగుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం కేటాయించిన 811 టీఎంసీల్లో 459 టీఎంసీల వరద ఎగువ నుంచి రావాలి. మిగతా 352 టీఎంసీల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లభ్యం కావాలి. కానీ, ఎగువ నుంచి ఆ మేరకు వరద రావడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా నీటి లభ్యత 352 టీఎంసీల మేర లభ్యం కావడం లేదు. ఎగువ నుంచి వరదపైనే ఆధారపడాల్సిన పరిస్థితుల్లో శ్రీశైలం, నాగార్జునసాగర్ లాంటి ప్రాజెక్టుల ఆయకట్టుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు 2003-2024లో 147 టీఎంసీల వరద రాగా ఆ సమయంలో అదే అత్యల్పం. అప్పుడు రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడటంతో సమస్య తలెత్తింది. అలాగే 2015-16 సంవత్సరాల్లో శ్రీశైలం ప్రాజెక్టు చరిత్రలో అత్యంత తక్కువ వరద నమోదైంది. కేవలం 74 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. ఆ సమయంలో కూడా రాష్ట్రంలో కరువు ఛాయలు ఏర్పడ్డాయి. జూరాల ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరింది. అయినా.. ఉమ్మడి పాలమూరు జిల్లా తాగునీటి అవసరాలకు డెడ్ స్టోరేజీలో కూడా మోటార్లు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేసుకున్నారు. గత సంవత్సరం కూడా 2015-16 వాటర్ ఇయర్ తర్వాత అత్యంత తక్కువగా శ్రీశైలం ప్రాజెక్టుకు 145 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. శ్రీశైలం, జూరాల ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి పడిపోగా ఉమ్మడి పాలమూరు జిల్లా తాగునీటి అవసరాలకు కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 1.90 టీఎంసీల నీటిని విడుదల చేసుకోవాల్సి వచ్చింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనివిధంగా నీటినిల్వలు పడిపోయాయి. సాధారణంగా కృష్ణా బేసిన్‌లో 75 శాతం నీటి లభ్యత మించినప్పుడు క్యారీ ఓవర్ స్టోరేజీ కింద నిల్వ చేసుకొని తర్వాత వాటర్ ఇయర్‌లో వాడుకోవచ్చు. కానీ, శ్రీశైలం ప్రాజెక్టు వద్ద రెండు తెలుగు రాష్ట్రాలు పోటీపడి విద్యుదుత్పత్తి చేయడం వల్ల నీరంతా దిగువకు వెళ్లిపోతుంది. వరద వచ్చిన సంవత్సరాల్లో నిల్వ చేసుకునే సామర్థ్యం లేకపోవడంతో సముద్రంలోకి వదలాల్సి వస్తోంది.

ప్రాజెక్టుల వివరాలు (నీటి నిల్వ టీఎంసీల్లో- ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో..)

ప్రాజెక్టు పేరు	నీటి నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్ ఫ్లో	ఔట్ ఫ్లో
ఆలమట్టి	129.72	50.13	53901	430
నారాయణపూర్	37.64	25.06	218	96
ఉజ్జయిని	117.24	42.24	2836	200
జూరాల	9.66	7.33	0	1481
తుంగభద్ర	105.79	11.71	19201	396
శ్రీశైలం	215.81	37.09	179	1675
నాగార్జునసాగర్	312.05	121.38	0	947
పులిచింతల	45.77	0.43	0	50

ప్రతీఏటా కృష్ణానదికి భారీగా వరదలు వస్తాయి. వచ్చిన వరదకు అనుగుణంగా ప్రాజెక్టులు లేకపోవడంతో ఆ నీరంతా సముద్రం పాలవుతోంది. గడిచిన ఆరేళ్లలో గతేడాది మాత్రమే జూరాల ప్రాజెక్టుకు కనిష్ఠంగా వరద వచ్చింది. అందువల్ల కింద ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు నీరు వెళ్లని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీఏటా జూన్ చివరి నాటికి ఎగువన కర్ణాటకలో ఉన్న ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండిపోతాయి. జూలై మొదటి, రెండోవారాల్లో జూరాలకు వస్తాయి.

ఆరేళ్లలో గతేడాది కనిష్ఠ వరద..

అప్పటికే స్థానికంగా కురిసిన వర్షాలతో పాటు అడపాదడపా ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో జూరాల ప్రాజెక్టు కూడా నిండిపోతుంది. వరద మొదలైన ఒక్క రోజులోనే జూరాల గేట్లు ఎత్తివేస్తారు. 2018లో జూరాలకు 319 టీఎంసీల నీరు రాగా 2019లో 1,445 టీఎంసీలు, 2020లో 1300, 2021లో 893, 2022లో 1,230 టీఎంసీలు వచ్చాయి. 2023లో మాత్రం 150 టీఎంసీల నీరు జూరాల నుంచి దిగువకు వెళ్లింది. 2015 తర్వాత 2023లోనే అంత ఇబ్బందులు తలెత్తాయి. శ్రీశైలం ప్రాజెక్టు విషయానికి వస్తే 2015-16 సంవత్సరంలో 74 టీఎంసీల వరద వచ్చింది. 2016-17లో 351 టీఎంసీలు, 2022-2023లో 2,040 టీఎంసీలు, 2023-2024 సంవత్సరంలో 145 టీఎంసీలు వరద వచ్చింది. 2022-2023 సంవత్సరంలో 2,040 టీఎంసీల భారీ వరద వచ్చినప్పటికీ 1,331 టీఎంసీలు సముద్రంలో కలిసిపోయింది. ప్రస్తుత ఏడాది కూడా వరద ఆశాజనకంగా లేదు. ఎగువన వర్షాలు కురవకపోతే ఆలమట్టి నిండటానికే ఇంకా సమయం పట్టే పరిస్థితి ఉంది. శ్రీశైలానికి మరో సోర్స్ అయిన తుంగభద్రకు కూడా వరద ఆలస్యమవుతోంది. ఆ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 105.79 టీఎంసీలు కాగా ప్రస్తుతం కేవలం 6.78 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ వాటర్ ఇయర్‌లో ఆలమట్టి నుంచి మొదలుకొని పులిచింతల వరకు 52.58 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. వరద ఆలస్యమైతే వానాకాలం పంటలపై ప్రభావం పడనుంది.

ఆత్మీయ అనుచరుడికి కన్నీటి నివాళి

- కోస్గి మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి ఓదార్పు

కోస్గి, జూలై 5 : తన ఆత్మీయ అనుచరుడు నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మునిసిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి మృతికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం ఘనంగా నివాళి అర్పించారు. కోస్గి మునిసిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో గల గోవర్ధన్‌రెడ్డి నివాసానికి రాగానే మృతుడి తల్లి యాదమ్మ ముఖ్యమంత్రి కాళ్లపై పడి బోరున విలపించింది. ముఖ్యమంత్రి ఆమెను దగ్గరకు తీసుకొని నేనున్నానంటూ ధైర్యం చెప్పారు. అనంతరం గోవర్ధన్‌రెడ్డి పార్థివదేహం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి కన్నీరు పెట్టుకున్నారు. నమ్ముకున్న కార్యకర్త మృతి ఆయనను ఒక్కసారి కుదిపేసింది. అనంతరం గోవర్ధన్‌రెడ్డి భార్య సావిత్రమ్మ, కుమారుడు శంకర్‌రెడ్డి, కుమార్తె శశాంతికను ఓదార్చారు. తాను అండగా ఉంటానని అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి వెంట ఆయన సోదరుడు, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు ఉన్నారు.

కోస్గి ఇంజనీరింగ్ కళాశాలకు
ఏఐసీటీఈ గ్రీన్ సిగ్నల్

- సీఎం చొరవతో మార్గం సుగమం

నారాయణపేట, జూలై 5: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో కోస్గిలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని ఈ కళాశాలకు తాజాగా ఏఐసీటీఈ(ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ ఇంజనీరింగ్, ఏఐ మరియు ఎంఎల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 50 సీట్ల చొప్పున మొత్తం 150 సీట్లు కేటాయించారు. అనుభవజ్ఞులైన పది మంది డాక్టరేట్ అధ్యాపకులతో బోధన చేయనున్నారు. ఆధునిక ప్రయోగశాలలు, హాస్టళ్లు, వర్క్‌షాప్స్ వంటి సదుపాయాలు కల్పించనున్నారు. క్యాంపస్ సెలెక్షన్స్ కూడా నిర్వహించనున్నారు. ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా కోస్గి కళాశాలను ఎంచుకునే అవకాశం ఉంది. ఇంజనీరింగ్ కళాశాల సొంత భవనం కోసం సర్వే నంబర్ 1737లో పది ఎకరాల భూమిని కేటాయించారు. సీఎం రేవంత్‌రెడ్డి జనవరిలో భూమి పూజ కూడా చేశారు. రూ.20 కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించనున్నారు. ఆ భవనం నిర్మాణం జరిగే వరకు తాత్కాలికంగా పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాల కొనసాగనుంది. ఆ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు పట్ల ఈ ప్రాంత విద్యావేత్తలు, విద్యార్థుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

కోటి మొక్కలు నాటాలి

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- మన్ననూరు వన మహోత్సవంలో పాల్గొన్న దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు
- స్టడీ టూర్‌లో భాగంగా పర్యాటక ప్రాంతాల సందర్శన



మొక్కను నాటి నీరు పోస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్/అచ్చంపేట/దోమలపెంట, జూలై 5: నాగర్‌కర్నూల్ జిల్లాలో కోటి మొక్కలు పెంచడమే లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా అధికారులు అడుగులు వేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని చింతల చెరువు రెవెన్యూ పొలంలో శుక్రవారం 75వ వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూపల్లితో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు. జూపల్లి జామ మొక్క, దామోదర రాజనర్సింహ రావి మొక్కలను నాటారు. ఎమ్మెల్యేలు ఒక్కో మొక్కను నాటారు. ఈ సందర్భంగా పాటలు పాడిన జానపద కళాకారులను మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను జానపద కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్న 543 మంది కళాకారులను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని వారు విన్నవించారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి దామోదర రాజనరసింహ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ జిల్లాలో 40 లక్షల మొక్కలను వన మహోత్సవంలో నాటాలని లక్ష్యం పెట్టుకోగా, కోటి మొక్కలు పెంచేలా ప్రతీ అధికారి కృషి చేయాలని చెప్పారు. అనంతరం నల్లమలను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలన్న సీఎం సూచన మేరకు స్టడీ టూర్‌లో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు బస్సులో ఫరహాబాద్ చౌరస్తా వరకు వెళ్లారు. అక్కడి నుంచి సఫారీ వాహనాల్లో పర్యాటక ప్రాంతాలను చూసేందుకు పోయారు. ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు. ఎమ్మెల్యేలు, అటవీ, ఇతర ముఖ్య అధికారులను మాత్రమే స్టడీ టూర్‌కు అనుమతించారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అటవీశాఖ క్షేత్ర సంచాలకులు(ఎఫ్‌డీ)శివాని డోగ్ర, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఎంపీడీవో మోహన్‌లాల్, తహసీల్దార్ సరిత, నాయకులు పాల్గొన్నారు.

పర్యాటకులను రప్పించడంలో విఫలం

రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్న నల్లమలకు పర్యాటకులను రప్పించడంలో గత పాలకులు విఫలమయ్యారని మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనరసింహ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ప్రాంతాన్ని టూరిజంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని, తద్వారా యువతకు ఉపాధి లభించడంతో పాటు రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఉమ్మడి జిల్లా అధికార పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి జూపల్లి, దామోదర రాజనరసింహ శుక్రవారం ఉమామహేశ్వరం ఆలయాన్ని, నిరంజన్ షావలీ దర్గాను దర్శించుకున్నారు. నల్లమలను టూరిజంగా అభివృద్ధి చేసేందుకు టూరిజం, ఫారెస్టు శాఖల సంయుక్తంగా పీపీపీ పద్ధతి ద్వారా ఆదాయం పెంచే కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. వారి వెంట జిల్లా అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.



ఫరహాబాద్ వ్యూ పాయింట్ వద్ద మంత్రులు జూపల్లి, దామోదర, ఎమ్మెల్యేలు

మల్లెలతీర్థం జలపాతం వద్దకు..

నల్లమల అభయారణ్య ప్రాంతంలోని మల్లెల తీర్థం జలపాతాలను మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సందర్శించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే వంశీకృష్ణ మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.



కోనసీమ కాదు.. పల్లెసీమ

ఈ ఫొటోను చూసి ఇదేదో కోనసీమ అనుకుంటే మీరు పొరబడ్డట్టే. ఈ ఫొటో తీసింది కోనసీమలో కాదు. ఓ పల్లెసీమలో.. కొబ్బరి చెట్లు నీలాకాశంలోకి ఎగబాకినట్లున్న ఈ దృశ్యం మణిరత్నం సినిమాలోని అందమైన ఫ్రేమ్‌లా కనిపిస్తోంది. చూపరులకు కనువిందు చేస్తోంది. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చెన్నూరు గ్రామానికి వెళ్తుండగా దారి మధ్యలో కనిపించిన ఈ చెట్లను 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి జిల్లా

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

బిజినేపల్లి, జూలై 5: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం సమీపంలో గల ఈద్గా వద్ద రెండు బైక్‌లు శుక్రవారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగనూర్ గ్రామానికి చెందిన మంగళి తిరుపతయ్య(36) నాగర్‌కర్నూల్ వైపు నుంచి మంగనూర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. ఖానాపూర్ గ్రామానికి చెందిన సాయికుమార్(20) బిజినేపల్లి నుంచి పాలెం వైపు మరో బైక్‌పై వెళ్తున్నాడు. ముసురు వర్షానికి సరిగా కనిపించకపోవడంతో ఇద్దరు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తిరుపతయ్య చనిపోయాడు. సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి 100కు చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో సాయికుమార్‌ను, తిరుపతయ్య శవాన్ని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ఎదురు చూపులు డబుల్

- రెండు పడక గదుల ఇళ్ల కోసం పేదల ఎదురు చూపులు
- మహబూబ్‌నగర్ జిల్లాకు 8,566 మంజూరు
- లబ్ధిదారులకు 3,901 ఇళ్లు కేటాయింపు
- నేటికీ నిర్మాణం ప్రారంభం కాని 1,648 గృహాలు



జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

జడ్చర్ల, జూలై 5: మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాకు ప్రభుత్వం 8,566 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేసింది. అందులో మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 3,550 ఇళ్లు కేటాయించారు. తర్వాత జడ్చర్లకు 2,652, దేవరకద్రకు 1,863, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో నారాయణపేటకు 226, పరిగికి 200, వనపర్తికి 75 ఇళ్లు కేటాయించారు. 8,566 ఇళ్లలో 5,279 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. మరో 1,639 ఇళ్లు నిర్మాణంలో ఉండగా.. 1,648 ఇళ్ల నిర్మాణం నేటికీ ప్రారంభం కాలేదు. దీనిని బట్టి చూస్తే ఇళ్ల నిర్మాణం ఎంత నిదానంగా సాగుతుందో తెలుస్తోంది.

నిర్మాణం పూర్తయిన వాటిలో 3,901 ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించారు. వారిలో 3,086 లబ్ధిదారులకు తాళాలు ఇచ్చారు. మిగతా నిర్మాణం పూర్తయిన 1,378 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే నారాయణపేట, పరిగి నియోజకవర్గాలకు కేటాయించిన ఇళ్ల నిర్మాణం నేటికీ ప్రారంభం కాలేదు.

ఆలస్యానికి అదే కారణం?

ఇళ్ల నిర్మాణాల ఆలస్యానికి ఖర్చు పెరగడంతో పాటు బిల్లులు సకాలంలో రాకపోవడమే కారణమని కాంట్రాక్టర్‌లు చెబుతున్నారు. నిర్మాణానికి ఇసుకను తామే ఇస్తామని, సిమెంట్‌ను నేరుగా పరిశ్రమల నుంచి ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పగా నిర్మాణాలు ప్రారంభమైన అనంతరం పరిస్థితి భిన్నంగా మారిందని అంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణలో ఆలస్యం కూడా నిర్మాణంలో జాప్యానికి ఒక కారణమని తెలుపుతున్నారు. అయితే కాంట్రాక్టర్లు పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించడమే ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

560 ఎస్ఎఫ్‌టీలో ఇళ్లు

అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. 560 ఎస్ఎఫ్‌టీలో రెండు బెడ్‌రూమ్‌లు, ఒక కిచెన్, వాష్ ఏరియా, అటాచ్డ్ బాత్‌రూంలతో పాటు కారిడార్, మెట్లు ఉండేలా ప్లాన్ చేశారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో మాదిరిగా గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఒకటి, రెండు ఫ్లోర్‌లు, మరికొన్ని ప్రాంతాలలో నాలుగు ఫ్లోర్‌లలో నిర్మాణం చేపట్టారు. ఒక్కో ఇంటిని అర్బన్ ప్రాంతంలో రూ.ఐదు లక్షలా 30 వేలతో, రూరల్ ప్రాంతంలో రూ.ఐదు లక్షలా నాలుగు వేలతో నిర్మించారు. ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌ను పెంచాలని కాంట్రాక్టర్‌లు కోరుతున్నారు.



నిర్మాణం పూర్తయిన ఇళ్లు

గోవిందా..గోవిందా..

- ఆలయాల్లో అమావాస్య పూజలు

చిన్నచింతకుంట, జూలై 5: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలోని శ్రీకురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి ఆలయం శుక్రవారం అమావాస్య సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. జాతర మైదానంలోనూ భక్తులు స్వామి వారి దాసంగాలు పెట్టారు. అనంతరం స్వామిని దర్శించుకుని, ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. గుట్ట కింది భాగంలో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. కొనుగోలుదారుల సందడి నెలకొంది. అయితే భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి గిరులు గోవిందా.. గోవిందా... కురుమూర్తివాసా గోవిందా అంటూ పులకించి పోయాయి. భక్తులకు అన్నదాన వసతిని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం నుంచి వర్షం కురియటంతో భక్తులు రేకుల షెడ్లల్లోకి పరుగులు తీశారు. అవి ఏమాత్రం సరిపోక పోవటంతో ఒకింత అసౌకర్యానికి గురైయ్యారు.



కురుమూర్తిలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కోయిలకొండలో పూజలు అందుకుంటున్న శ్రీరామచంద్ర స్వామి

శ్రీరామకొండలో..

కోయిలకొండ : మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన స్వయం భూ రామపాధ క్షేత్రం శ్రీరామకొండలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ చంద్రస్వామికి అభిషేకం, విష్ణు సహస్రనామ తులసీ అర్చన పూజలను జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రామచంద్రస్వామిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని వీరభద్రస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా భద్రకాళి వీరభద్రస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా మట్టెద్దుల అమావాస్య

నారాయణపేట, జూలై 5: నారాయణపేట జిల్లా వ్యాప్తంగా రైతులు, పలు వర్గాల వారు మట్టెద్దుల అమావాస్యను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వరుణుడి కరుణతో వర్షాలు బాగా కురిసి వానాకాలం పంటలు పండాలని అన్నదాతలు మట్టెద్దులకు పూజలు చేశారు. ఏరువాక పౌర్ణిమ అనంతరం వచ్చే అమావాస్య పర్వదినాన కుమ్మరులు ఒండ్రు మట్టితో తయారు చేసిన మట్టెద్దులను విక్రయించారు. పలువురు రైతులు, పొలాలు ఉన్నవారు మట్టెద్దులను కొనుగోలు చేసి వాటికి గరక, పూలు, పసుపు, కుంకుమలతో అలంకరించి ఇళ్లల్లో పూజలు నిర్వహించారు. కర్ణాటక సరిహద్దు తెలంగాణ ప్రాంతాల్లో మట్టెద్దుల అమావాస్యను రైతులు భక్తి శ్రద్ధలతో చేస్తూ భక్షాలతో తీపి వంటకాలను తయారు చేసి ఆరగించారు.



పూజలందుకుంటున్న మట్టి ఎద్దులు

కరెంటు మోటారు వైర్ల దొంగలకు రిమాండ్

కోడేరు, జూలై 5 : కరెంటు మోటారు వైర్లను దొంగిలించిన వ్యక్తులను కొల్లాపూర్ కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు కోడేరు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఎస్ఐ విలేకర్లతో మాట్లాడుతూ కోడేరు కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో కరెంటు మోటారు వైర్ల దొంగతనానికి పాల్పడిన ఉల్లంగుండ్ల వంశీ, ముద్దంగుల శివకుమార్, పుల్లయ్యలకు రిమాండ్ విధించారని, మిగతా ఇద్దరు మైనర్లు కావడంతో స్టేట్ హోంకు తరలించినట్లు తెలిపారు.

పేట జిల్లాలో ఓ మోస్తరు వర్షం

నారాయణపేట, జూలై 5 : నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దాంతో వానాకాలంలో సాగుచేసిన వర్షాధార పంటలైన పత్తి, కంది, పెసర పంటలకు ఊరట లభించింది. నారాయణపేటలోని జిల్లా ఆసుపత్రి రోడ్ గుంతల్లో వర్షం నీరు నిలువడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. జిల్లాలో అత్యధికంగా ధన్వాడ మండలంలో 50.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా మాగనూర్ మండలంలో 1.0మి.మీ. వర్షపాతం నమోదైంది. దామరగిద్ద మండలం గుండుమాల్‌లో 41.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మక్తల్ మండలం జక్లేర్‌లో 31.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఊట్కూర్‌లో 38.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట మండలం కోటకొండలో 25.8 మి.మీ.వర్షపాతం నమోదైంది. మరికల్‌లో 36.8 మి.మీ. కృష్ణలో 1.3 మి.మీ; మద్దూర్ మండలంలో 18.3 మి.మీ; కోస్గి మండలంలో 19.3 మి.మీ; నారాయణపేట, చిన్నజట్రంలో 1.3 మి.మీ; మక్తల్‌లో 2.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు గేదె మృతి

కోస్గి, జూలై 5 : పిడుగు పాటుకు గురై గేదె మృతిచెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురవడంతో చంద్రవంచ గ్రామానికి చెందిన పాకల మొగులయ్య పొలంవద్ద పిడుగుపడింది. చెట్టుకింద గేదె ఉండటంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని రైతు మొగులయ్య బోరున విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మరదలిని గొలుసుతో కొట్టిన బావపై కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, జూలై 5 : భూతగాదాలో తమ్ముడి భార్యపై గొలుసుతో దాడి చేసిన బావపై కేసు నమోదైన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... మానవపాడు మండలం, పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన రజియాబీకి అలంపూర్ చౌరస్తా సమీపంలో 28 గుంటల వ్యవసాయ భూమి ఉంది. పక్కనే తనభర్త అన్న అయిన హుస్సేన్‌కు కూడా ఈమేలాగే సమాన భూమి ఉంది. ఇరువురి మధ్య శుక్రవారం గెట్ల వివాదం జరగడంతో హుస్సేన్ విచక్షణ కోల్పోయి మరదలు అయిన రజియాబీపై గొలుసుతో దాడి చేశాడు. దీంతో బాధితురాలు ఉండవెల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంటపొలం చెరిపారని..

అలంపూర్ చౌరస్తా : ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరు గ్రామంలో సాగు చేస్తున్న పంటను చెరిపివేసిన ఘటనలో ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన వడ్డె ఈశ్వరన్న అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన మహమ్మద్‌బాబు అనే వ్యక్తి 2014లో కొనుగోలు చేశాడు. గతేడాది ఈశ్వరన్న చనిపోయాక తాను సాగుచేస్తున్న భూమి తన భర్తకు చెందినది అంటూ ఈశ్వరన్న భార్య సువర్ణ పంట చెరిపివేసిందని మహ్మద్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సదరు మహిళతో పాటు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉండగా తమకు 1.13గుంటల భూమిని సదరు వ్యక్తిపేర రిజిస్ట్రార్ చేయించి నగదు అప్పుగా తీసుకున్నామని, కొన్నేళ్ల తర్వాత వడ్డీతో సహా లెక్కకట్టి ఎ.1.0గు భమిని జమచేసి మిగతా భూమిని త భర్త పేర చేయాల్సి ఉందని, ఇంతలో తన భర్త మృతి చెందడంతో మిగులు భూమి ఇవ్వడంలేదని సదరు మహిళా బంధువులు ఆరోపిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

అలంపూర్ చౌరస్తా : ఉండవల్లి మండలం, పుల్లూరు గ్రామ శివారులోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ వెంచర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్‌చోరీకి గురైన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పుల్లూరు టోల్‌ప్లాజా పక్కన గోరంట్ల గ్రీన్ అనే వెంచర్ ఈనెల 2న సూపర్‌వైజర్ సంజీవరెడ్డి నూతన ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు పనులు చేయించి మరుసటి రోజు సెలవుపై వెళ్లాడు. మరుసటి రోజు పనులకు వచ్చిన కూలీలు కరెంటు సరఫరా లేకపోవడంతో సంజీవరెడ్డికి సమాచారం ఇచ్చారు. వచ్చి పరిశీలించగా ట్రాన్స్‌పార్మర్‌లో ఆయిల్ చోరీకి గురైనట్లు తెలుసుకుని ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన ఆయిల్ విలువ రూ.18వేలు ఉంటుందని ఫిర్యాదులో తెలిపాడు.

ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు బిగిస్తే కేసు


సైలెన్సర్ తొలగిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్, జూలై5: ద్విచక్ర వాహనాలకు కంపెనీల సైలెన్సర్లు కాకుండా ఇష్టాను సారంగా మార్పు చేసుకుని శబ్ద కాలుష్యం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ఆదేశాల మేరకు శుక్రవారం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. ఇష్టానుసారంగా వాహనాలకు సైలెన్సర్లు బిగించిన నడుపుతున్న వారిని గుర్తించి అప్పటికప్పుడే తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మోటారువాహన చట్టం నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను మోడిఫై చేస్తూ రోడ్లపై వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా శబ్దాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై ద్విచక్రవాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దుతోపాటు మూడు నెలలు జైలుశిక్ష ఉంటుందని హెచ్చరించారు. అదేవిధంగా మెకానిక్‌లు కూడా ద్విచక్రవాహనాల సెలెన్సర్‌ల మార్పును ప్రోత్సహించవద్దని సూచించారు.

పాల కేంద్రం వద్ద రైతుల ఆందోళన


పాలకేంద్రం వద్ద ఆందోళనకు దిగిన రైతులు

వంగూరు, జూలై 5: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని చౌదరిపల్లిలో శుక్రవారం విజయ డైయిరీకి చెందిన పాలకేంద్రం వద్ద పాడి రైతులు ఆందోళనకు దిగారు. డైయిరీ నిర్వాహకులు లీటర్‌కు రూ, 30 నుంచి రూ. 35లు మాత్రమే చెల్లిస్తున్నారని, ఇదేమిటని అడిగితే వెన్నశాతం రావడం లేదని చెబుతున్నారని పాడి రైతులు వాపోయారు. వెన్న శాతాన్ని గుర్తించే మిషన్‌ను ఏర్పాటు చేసుకోకుండా తోచినంత రాస్తూ పాలకు తక్కువ ధర చెల్లిస్తూ మోసగిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మిషన్‌ను ఏర్పాటు చేయాలని లేదంటే పాలు పోయబోమని రైతులు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన చందా మహేష్

వనపర్తి రూరల్, జూలై5: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి .. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన వనపర్తి మండల పరిధిలోని నాగవరం పెట్రోల్ బంకు దగ్గర శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన చందా మహేష్ (45), కుమ్మరి సాయి బాబా వీరిద్దరూ లారీ డ్రైవర్లు. కొత్తకోటలోని ఓ యజమాని దగ్గర డ్రైవర్‌గా పని చేస్తున్నారు. తమ సొంత పని నిమిత్తం కొత్తకోట నుంచి వనపర్తికి వెళ్తుండగా నాగవరం పెట్రోల్ బంకు దగ్గర ఎదురుగా వస్తున్న ఫోర్‌వీలర్ వాహనం ముందున్న కారును ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న వీరి టూ వీలర్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చందా మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన సాయిబాబాను జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ జలంధర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తిటౌన్, జూలై 5 : మునిసిపల్ అధికారిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని ఎల్‌టీపీ ఇంజనీరింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీనగర్ కాలనీలో పిండిగిర్ని నడిపిస్తున్న శ్రీకాంత్ అనే వ్యక్తిపై కాలనీవాసులు ఫిర్యాదు మేరకు విచారణకు వెళ్లిన మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి విజయ్‌పై దాడికి పాల్పడటం సరి కాదన్నారు. ఇలాంటి దాడులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని, ఇందుకు నిరసనగా పది రోజుల పాటు విధులు బహిష్కరిస్తున్నట్లు ఎల్‌టీపీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అలాగే దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లువారు వివరించారు. కార్యక్రమంలో ఎల్‌టీపీ ఉద్యోగులు సురేందర్, మనోహర్‌రావు, మహబూబ్‌అలీఖాన్, యునస్, సురేష్, మహేష్ తదితులున్నారు.

బెల్లం పట్టివేత - ఒకరి అరెస్టు

కల్వకుర్తి, జూలై 5 : అక్రమంగా తరలిస్తున్న బెల్లం, సారాను పట్టుకున్న సంఘటన శుక్రవారం కల్వకుర్తిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండ లం ఎల్లికల్ తండాకు చెందిన గుండ్యానాయక్ అక్రమంగా 180కేజీల నాలుగు లీటర్ల సారాను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పట్టుకొని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ తనిఖీల్లో టీమ్ సభ్యులు మహేష్, నర్యా, పురుషోత్తం, భీమమ్మ ఉన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

కోస్గి, జూలై 5: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఆత్మకూరుకు చెందిన రజిత (22) గత ఏడాదిన్నర క్రితం ఇన్‌స్ట్రాగ్రాంలో నాచారం గ్రామానికి చెందిన రాజుతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త వివాహం దాక వెళ్లింది. తరువాత వారు ఇరువురికి సక్యత కుదరకపోవడంతో పెద్దల సమక్షంలో విడిపోతున్నట్లు ఆత్మకూరులో ఏడాది క్రితమే ఒప్పందం చేసుకున్నారు. కానీ వారు ఇరువురు మళ్లీ ఫోన్‌లో మాట్లాడుకొని కోస్గి బీసీ కాలనీలో కాపురం పెట్టారు. వీరికి 11నెలల పాప ఉంది. మళ్లీ వీరి మధ్య శుక్రవారం గొడవ జరగడంతో రజిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతిచెందింది. గమనించిన రాజు వెంటనే కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఈ విషయంపై సమాచారం ఉందని ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై రమణ తెలిపారు.

దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 5 : భూ వివాదంలో తమ పాలివారు దాడి చేశారని నాగర్‌కర్నూల్ మండలం లోని వనపట్ల గ్రామానికి చెందిని పర్వత్ గౌడ్ అతడి భార్య లక్ష్మీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గోవర్ధన్ మాట్లాడుతూ తమపై దాడి చేసినట్లు పర్వత్ గౌడ్, అతడి భార్య లక్ష్మీ ఫిర్యాదు చేశారన్నారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడాకారుడికి సన్మానం


క్రీడాకారుడు జీవన్‌ను సన్మానిస్తున్న పీడీ, పీఈటీలు

జడ్చర్ల, జూలై 5: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ శిక్షణ శిబిరానికి ఎంపికైన క్రీడాకారుడు జీవన్‌ను శుక్రవారం జడ్చర్ల మినీ స్టేడియంలో స్థానిక పీడీ, పీఈటీలు సన్మానించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో భోపాల్‌లో నిర్వహించనున్న 15రోజు శిక్షణ శిబిరానికి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. మంచి ప్రతిభ కనబరిచి జడ్చర్లకు పేరు తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు మొయిన్, కిట్టు, శ్రీను, రాజు, స్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంక్షేమం కరువు

- పాలెంలో శిథిలావస్థ భవనంలోనే కొనసాగుతున్న వసతిగృహం
- భయం భయంగా గదుల్లో ఉంటున్న విద్యార్థులు
- చినుకు పడితే రూంలోకి నీళ్లు
- కిటికీలు లేకపోవడంతో విజృంభిస్తున్న దోమలు
- బిజినేపల్లి హాస్టల్ చుట్టూ అపరిశుభ్రత


పాలెంలో శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనం

బిజినేపల్లి, జూలై 5 : పేద విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు వసతి కల్పిస్తే చదువుకొని ఉన్నతస్థాయికి ఎదుగుతారని ప్రభుత్వాలు సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల శాఖల ద్వారా వసతి గృహాలను ఏర్పాటు చేస్తే వాటిని పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలి మీద పడిపోతుందన్న భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నట్లు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిజినేపల్లి మండల కేంద్రంలో ఎస్సీ సంక్షేమ హాస్టల్, పాలెంలో మూడంతుస్తుల భవనంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మూడు హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. పాలెంలోని మూడు హాస్టళ్లల్లో 240 మంది దాకా విద్యార్థులు ఉన్నారు. 1965లో పాలెం సుబ్బయ్య సహకారంతో హాస్టల్ భవనం నిర్మించారు. ఐదు దశాబ్దాలుగా పాలెంలో సుబ్బయ్య స్థాపించిన విద్యాసంస్థల్లో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చి హాస్టల్‌లో ఉండి చదువుకునేవారు. పాలెంలోని ప్రభుత్వ హాస్టల్ ఉండి చదువుకొని దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న పాలెంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనం నేడు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందోనన్న ఆందోళన స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది. కంటి తుడుపుగా అధికారులు అప్పుడప్పుడు మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి ఒకసారి పాలెంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాన్ని పరిశీలించి నూతన భవనం నిర్మాణంకు ఆదేశాలు జారీ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. నూతన భవనం నిర్మిస్తే పేదింటి పిల్లలు వసతి గృహాల్లో ఉండి ఉన్నత విద్య అభ్యసంతో ఉన్నత శిఖరాలకు చేరకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బిజినేపల్లి హాస్టల్ భవనం ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హాస్టల్ చుట్టూ మురుగు కాల్వ ఉండడంతో నిత్యం పందులు రావడంతో దుర్గంధం వెదజల్లి విద్యార్థులు రోగాల పాలవుతున్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉండేది పేద కుటుంబాల పిల్లలే కదా అని అటూ అధికారులు, ఇటూ ప్రజా ప్రతినిధులు చులుకన భావనతో పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే నూతన హాస్టల్ భవనాలను నిర్మించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వానాకాలం వస్తే రూంలో నీళ్లు నిండుకుంటాయి



వాన వస్తే కిటికీలకు తలుపులు లేకపోవడంతో నీళ్లు లోపలికి వస్తాయి. స్లాబ్, గోడలు నుంచి నీళ్ల వ స్తాయి. మూడంతస్తుల భవనం అంతా గోడలు నెర్ర లు బారి ఎప్పుడు కూలి పడుతుందోనన్న భయంతోనే ఉంటున్నాం. కిటికీలు, తలుపులు సరిగ్గా లేకపోవడంతో దోమలు కుట్టి రోగాల బారిన పడుతున్నాం. ఇంటి వద్ద ఉండి చదువుకుందామనుకుంటే ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో చేసేది ఏమీలేక చదువుకోవాలనే కోరికతో భయం, భయంగానే ఉంటున్నాం.

- ఎం.గణేష్, హాస్టల్ విద్యార్థి, పాలెం

భయంతోనే రాత్రిళ్లు గడుపుతున్నాం



తల్లిదండ్రుల పరిస్థితిని చూసి ఇంటికి పోలేక, హాస్టల్‌లో ఉండలేక భయంతోనే గడుపుతున్నాం. ఎక్కడ ఏ చిన్న శబ్దమైన గోడలు కూలి పడ్డాయోమోన్నన ఆందోళన కలుగుతుంది. హాస్టల్ భవనం కొత్తది నిర్మిస్తే ఎక్కువ మంది విద్యార్థులు వసతి పొంది ఉన్నత చదువులు చదుకుంటారు. పేద విద్యార్థులకు మేలే చేయాలనుకుంటే స్థానిక నాయకులు కొత్త భవనం కట్టేందుకు కృషి చేయాలి. కిటికీలు, మౌలిక వసతులు కల్పించాలి.

-వి.అంజనేయులు, హాస్టల్ విద్యార్థి, పాలెం

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం



హాస్టల్ భవనం నిర్మించి 60 సంవత్సరాలు దాటింది. బిల్డింగ్ మొత్తం పెచ్చులూడి వర్షం నీరు రూంలోకి వస్తున్నాయి. మరుగుదొడ్లు పూర్తిగా పాడై వినియోగంలో లేవు. మూడేళ్ల క్రితం భవనం పూర్తిగా శిథిలమైంది. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. అన్ని వసతులు కల్పిస్తున్న హాస్టల్ భవనం పూర్తిగా ధ్వంసం కావడంతో పిల్లలు భవనంలో ఉండేందుకు జంకుతున్నారు. నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది.

-గోపాల్ నాయక్, సీ హాస్టల్ వార్డెన్, పాలెం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

- బ్యాడ్మింటన్ మహబూబ్‌నగర్ జిల్లా సంఘ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్
- హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 5 : క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమాని, క్రీడాస్ఫూర్తిని చాటాలని షటిల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి 10వ అండర్-19 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ రెండో రోజు పోటీలను డీవైఎస్‌వో ఎస్. శ్రీనివాస్, షటిల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్ సుందర్ గౌడ్, రవికుమార్ ప్రారంభించారు. టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయడం వల్ల మొదటి సారి రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించే అవకాశం లభించిందన్నారు. షటిల్‌బ్యాడింటన్ టోర్నీలో ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి సంఘం తరుపున కృషి చేస్తామని, ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవి కుమార్, కార్యనిర్వహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షులు విజయ్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, చైతన్యరెడ్డి, రాం కుమార్, ట్రైజరర్ ఎల్.రాజశేఖర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

- నేడు ఫైనల్స్

టోర్నీలోని మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రెండో రోజు నాకౌట్, క్వార్టర్ ఫైనల్, సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. పలువురు క్రీడాకారులు సత్తాచాటి సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ లో ఫైనల్స్‌కు చేరారు. బాలుర సెమీఫైనల్స్ సింగిల్స్ లో అశ్రిత్ వలిశెట్టి(మెదక్) ఎస్.అఖిల్‌రావు (వరంగల్)పై, ఎం.అజయ్‌కార్తీక్(జనగామ) ప్రణవ్ శ్రీకర్ (నిజామాద్)పై విజయం సాధించారు. బాలికల సింగిల్స్ సెమీస్‌లో శ్రేష్ఠరెడ్డి(హైదరాబాద్)పై, ప్రశంస (ఖమ్మం) రిషితా పాండే(వరంగల్)పై గెలుపొం దారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో శ్రీసాయి, అలీసాలు, శౌర్యకిరణ్, ప్రాంజలపై విజయం సాధించారు. మరో మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎం.అజయ్ కార్తీక్, కీర్తిలు, ఎల్లోరా,సాయిరామన్‌లపై గెలుపొందారు.

నేడు అచ్చంపేట మునిసిపల్ ఛైర్మన్ ఎన్నిక

అచ్చంపేట టౌన్, జూలై 5: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మునిసిపల్ ఛైర్మన్ ఎన్నిక శనివారం ఉండనున్నట్లు కమిషనర్ శ్యాంసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన నూతన ఛైర్మన్ ఎన్నిక జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభ్యులు హాజరుకావాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

ఖిల్లాఘణపురం, జూలై 5: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురు వ్యక్తులను కోర్టులో ప్రవేశపెట్టగా ముగ్గురికి జైలు శిక్ష, ఒకరికి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం .. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల పరిధిలో పోలీసులు డ్రంకెన్‌డ్రవ్ తనిఖీల్లో నిర్వహించగా నలుగురు వ్యక్తులు పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం వనపర్తి రెండవ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరుచగా న్యాయాధికారి మండలంలోని అప్పారెడ్డి పల్లి గ్రామానికి చెందిన సొంటం చెన్నయ్య, సోలిపురం గ్రామానికి చెందిన కృష్ణయ్య, పర్వతాపురం గ్రామానికి చెందిన టక్కుల శివ అనే వ్యక్తులకు ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్ష విధించగా, గద్వాలకు చెందిన కిష్టన్నకు రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డుపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచార నిందితుడి రిమాండ్

కొత్తకోట, జూలై 5 : కొత్తకోట పట్టణంలో పదేళ్ల బాలికలను అత్యాచారం చేసిన నిందితుడు ఆంజనేయులును అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వనపర్తి కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయ అధికారి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అన్నపై దాడి చేసిన వ్యక్తి..

గోపాల్‌పేట, జూలై5 : నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తుడికుర్తి బాలమ్మకు కురుమూర్తి, కృష్ణయ్య ఇద్ద రు కొడుకులు. ఇరువురి మధ్య భూ పంచాయితీ నడు స్తోంది. పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న అన్న కురుమూర్తిపై తమ్ముడు కృష్ణయ్య గొడ్డలితో దాడి చేసి పారిపోయాడు. శుక్రవారం పోలీసులు నిందితుడిని పట్టు కొని బుద్దారం గ్రామ సమీపంలోని పొదల్లో దాచిన గొడ్డలి ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నవ దంపతులకు తీవ్ర గాయాలు

అయిజ, జూలై 5: రోడ్డు ప్రమాదంలో నవ దంపతులు గాయపడ్డారు. ఈ ఘటన గద్వాల జిల్లా అయిజ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అయిజ పట్టణానికి చెందిన నవ దంపతులు ప్రసాద్, నర్సమ్మ ద్విచక్రవాహనంపై రాయలసీమ ప్రాంతంలోని ఉరుకుంద వీరన్నస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. వీరిద్దరు తిరిగి వస్తున్న క్రమంలో నాగల్‌దిన్నె సమీపంలో గంగవరం గ్రామం సమీపంలో ట్రాక్టర్ నేరుగా వచ్చి వారి వాహనాన్ని ఢీకొన్నది. ఈ సంఘటతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు కావటంతో రాయలసీమలోని ఎమ్మిగనూర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

లోకల్ బాడీ ఎన్నికలపై దృష్టి సారించాలి

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గం వారీగా సమీక్ష


ఎన్నికల ఫలితాలపై సమీక్షిస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్ నగర్ (క్లాక్ టవర్), జూలై 5: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని వచ్చే లోకల్ బాడీ ఎన్నికలపై దృష్టి సారించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సూచించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముఖ్య నాయకులతో సమీక్షించారు. ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లు, అనుకూలతలపై కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని, అందుకు వైశ్యమ్యాలు పక్కన పెట్టి కార్యకర్తలు అందరు కలిసి పని చేయాలని అన్నారు. సమావేశంలో పార్లమెంట్ ప్రభారికి వీఎల్ఎన్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు నాగురావు నామోజీ, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు వి. శ్రీనివాస్ రెడ్డి, నారాయణ పేట జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కొండయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, అంధ్య బాబయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు రతంగ్‌పాండు రెడ్డి, పడాకుల బాలరాజు, కుర్వ రాములు, ఎగ్గని నర్సిములు, కె. రవీందర్ రెడ్డి, పార్లమెంట్ విస్తారక్ కేతూరి బుడ్డన్న, పార్లమెంట్ కో-కన్వీనర్ కె. శ్రీనివాసులు, నర్సింహులు గౌడ్, వివిధ అసెంబ్లీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న డీకే అరుణ

వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పాలమూరు ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎంపీ డీకే అరుణమ్మ ఆకాక్షించారు. శుక్రవారం ఆమె కాటన్ మిల్ వేంటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వాగతం పలికారు. ఎంపీ ప్రత్యేక పూలు చేశారు. అనంతరం డీకే అరుణను సన్మానించారు. ఆమె వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు

- కమీషన్లకు ఆశపడి అమాయకుల ప్రాణాలతో చెలగాటమా?
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


మిడ్జిల్ సెంటర్‌లో కుళ్లిన గుడ్లు

మిడ్జిల్, జూలై 5: అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన, నాసిరకం గుడ్లను సరఫరా చేస్తున్నారు. వరుసగా ఇలాంటి సంఘటలు చోటు చేసుకుం టుండగా, సదరు కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వేముల, బోయిన్‌పల్లి, మున్ననూర్, మిడ్జిల్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కుళ్లిన గుడ్లు రెండు, మూడు రోజులుగా వస్తున్నాయని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు శుక్రవారం తెలిపారు. కాంట్రాక్టర్‌ను హెచ్చరిస్తే అతడి నుంచి వచ్చే కమీషన్లు రావేమోనని భయపడి అధికారులు సైతం చర్యలు తీసుకోవడం లేదని బాహాటంగానే ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక గుడ్డు బరువు 50 గ్రాముల వరకు ఉం డాలని ఉండగా కేంద్రాలకు సరఫరా అయ్యేవి మాత్రం 30 గ్రాములు మాత్రమే ఉంటున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం, కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తున్న వారిపై సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్పనను వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన గుడ్లు వస్తున్నాయని శుక్రవారం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏయ్యే కేంద్రాలకు కుళ్లిన గుడ్లు వచ్చాయే అంగన్‌వాడీ టీచర్ల ద్వారా వివరాలు సేకరించి సీడీపీవోకు ఫిర్యాదు చేస్తాం.

గుట్టలపై బ్లాస్టింగ్ చేస్తే కఠిన చర్యలు


గుట్టపై మిషన్ భగీరథ ట్యాంకులున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

ఊర్కొండ, జూలై 5: గుట్టలపై బ్లాస్టింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ చెన్న కిష్టన్న, ఎస్సై వీరబాబు హెచ్చరించారు. శుక్రవారం నాగర్‌కర్నూ ల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట శివారులో ఉన్న గుట్టల పై మిషన్ భగీరథ ట్యాంకులు, అభయాంజనేయస్వామి వారి కోనేరు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుట్టలపై యంత్రాల ద్వారా కాకుం డా చేతి పనిముట్లతో అధికారులు మార్కు చేసిన ప్రాంతంలోనే పని చేసుకోవాలని సూచించారు. వడ్డెరలు తమ పనిముట్లతో చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తవని, రాయి కోయడానికి ఉపయోగించే యంత్రాలు, కంప్రెషర్ వాహనాలు, ఎక్స్‌కవేటర్లు ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్లాస్టింగ్ చేయడం వల్ల పరిసర ప్రాంతంలోని రైతులు, పాఠశాల విద్యార్థులు, మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద విధులు నిర్వహిస్తున్న కార్మికులు, అభయాంజనేయ స్వామివారి దేవాలయానికి వస్తున్న భక్తులు భయాందోళనలకు గురవుతున్నారని వెంటనే బ్లాస్టింగ్ చేయడం నిలిపివేయాలని తెలిపారు. బ్లాస్టింగ్ చేయడానికి ఉపయోగించే సామగ్రి లభించిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేస్తామన్నారు. వడ్డెరలు చేతి పనిముట్ల ద్వారా తయారు చేసిన కడీలను వాహనాల్లో తరలించే సమయంలో వాహన డ్రైవర్లు, యజమానులు రోడ్డు నియమావళి ప్రకారం నిబంధనలు పాటించాల్సి ఉంటుందని వివరించారు. వారి వెంట గిర్దావరు సతీష్‌చంద్ర, పోలీసులు విజయ్‌కాంగ్, మల్లేష్ తదితరులున్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ చేయొద్దు

- ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి



కమ్మారెడ్డిపల్లిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

తెలకపల్లి, జూలై 5 : ఆరోగ్యంపై అశ్రద్ధ పనికి రాదని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యశోద హాస్పిటల్ మలక్‌పేట హైదరాబాద్, ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్ తూడుకుర్తి వారి ఆధ్వర్యంలో తెలకపల్లి మండల పరిధిలోని కమ్మారెడ్డిపల్లిలో వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని గ్రామ ప్రజలకు తెలియజేశారు. సీజన్‌లో వాతావరణ మార్పుల వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పిలుపునిచ్చారు. యశోద హాస్పిటల్ మలక్‌పేట డాక్టర్లు, సిబ్బంది సేవలను కొనియాడారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వారికి సూచించారు. వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ.రామకృష్ణ, కార్యదర్శి సంపత్‌కుమార్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జయకుమార్, హైదరాబాద్ గాంధీ స్మారక నిధి ప్రతినిధి, హైదరాబాద్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు బుచ్చన్న, జేఎస్‌ఆర్ ఫౌండేషన్ సతీష్‌రెడ్డి, కమ్మారెడ్డిపల్లి ఉప సర్పంచ్ జానకిరామ్‌రెడ్డి, గ్రామ పెద్దలు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా డిమాండ్స్ డే ను జయప్రదం చేయండి

తెలకపల్లి, జూలై 5 : ఆలిండియా డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఆయన ఆశలనుద్దేశించి ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలని ప్రమోషన్లు కల్పించాలని ప్రతి 2వ తేదీన వారి అకౌంట్‌లో జీతాలు వేయాలని ప్రమోషన్ విషయంలో నిర్వహించే పరీక్షను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతీ సంవత్సరం జూలై 10న జాతీయ డిమాండ్స్ డే నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు కూడా నియోజకవర్గ స్థాయిలో జరిగే నేషనల్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. డాక్టర్స్ భానుప్రకాశ్‌కు ఆశాలు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కేవీపీఎస్ నాయకులు గోపాస్‌లక్ష్మణ్, హెల్త్ సూపర్‌వైజర్ ఫసియోద్దీన్, ఆశా మండల నాయకులు ఏ.పుష్ప, వరలక్ష్మీ, మాధవి, కురువమ్మ, జయమ్మ, కళావతి, స్వప్న, శ్రీలత, ఆలివేల తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై అనుచిత వ్యాఖ్యలను మానుకోవాలి



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కల్వకుర్తిటౌన్, జూలై 5 : హిందువులపై అనుచిత వ్యాఖ్యలను మానుకోవాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ పట్టణ నాయకులు అన్నారు. శుక్రవారం వారు పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. పార్లమెంట్‌లో హిందూవుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడరని, ఇలాంటి వ్యాఖ్యలను చేసే నేతలను, నాయకులను ప్రతీ ఒక్క హిందువు గమనిస్తున్నాడని, ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. రాహుల్‌గాంధీ వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు గిరిధర్ రెడ్డి, దుర్గాప్రసాద్, కృష్ణగౌడు, ఆంజనేయులు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

తిమ్మాజిపేట, జూలై 5 : పశువులలో సోకే ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు ఇప్పించి పలు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్ రైతులకు సూచించారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని మరికల్ గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించి పశువులకు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్ రైతులకు పలు సూచనలు, సలహాలు చేస్తూ ముద్దచర్మ వ్యాధి తెల్లజాతి పశువులలో మాత్రమే వస్తుందన్నారు. ఈ వ్యాధి వైరస్ ఒక పశువు నుంచి మరో పశువుకు ఈగలు, దోమ కాటు వల్ల సంక్రమిస్తుందన్నారు. పశువులు అత్యధిక శరీర ఉష్ణోగ్రత కలిగి ఉంటాయని చర్మం మీద ముద్దలు ముద్దలుగా వాపుల వంటి లక్షణాలు కలిగి ఉంటాయన్నారు. తమ పశువులకు రైతులు ముందు జాగ్రత్తగా ముద్ద చర్మ వ్యాధి నివారణ కోసం గోట్‌పాక్స్ టీకాను వేయించాలని సూచించారు. పశువైద్య సిబ్బంది శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలి

- దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి



కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 5: అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల ఫించన్‌ను రూ.6 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు మన్నెమోని కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వీహెచ్‌పీఎస్ కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్నెమోని కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరీ చేసే ఇందరమ్మ ఇళ్లల్లో వికలాంగులకు 5 శాతం కేటాయించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాన్ని ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాంగ్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకారం నాగరాజు, నాయకులు రమేష్, రాము, మశన్న, మల్లేష్, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

వంగపల్లి శ్రీనివాసులు దీక్షను జయప్రదం చేయండి



పెద్దకొత్తపల్లిలో వంగపల్లి శ్రీనివాసులు దీక్ష వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దకొత్తపల్లి, జూలై 5 : హైదరాబాద్ పట్టణంలో ఈ నెల7న ఇందిరా పార్కు దగ్గర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీను చేపట్టిన దీక్షను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వీరపాగ చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దకొత్తపల్లిలోని అంబేడ్కర్ బస్టాండ్ చౌరస్తాలో వంగపల్లి దీక్ష వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా జాప్యం చేస్తూ మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తల్వాజి వెంకటస్వామి, మండల అధ్యక్షుడు కురుమూర్తి, నాయకులు కల్మూరి రాజు, బంగారయ్య, రాములు ఉన్నారు.

పెంపుడు శునకాలకు యాంటీ రేబిస్ టీకాలు వేయించండి

అమ్రాబాద్, జూలై 5: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం అమ్రాబాద్, పదర మండలాల పరిధిలోని జంతు ప్రేమికులు పెంపుడు శునకాలకు మాంటీ రేబిస్ టీకాలు వేయించుకోవాలని అమ్రాబాద్ పశువైద్యాధికారి అనిల్ శుక్ర వారం విలేకరులకు తెలిపారు. అమ్రాబాద్, పదర పశువైద్య కేంద్రాల వద్ద మాంటీ రేబిస్ టీకాలను వేయించుకోవాలని జంతు ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

అచ్చంపేట అంతా అధ్వానం

- డ్రైనేజీలు, రహదారులు లేక ఇబ్బందులు
- రోగాలబారిన ప్రజలు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు



సాయినగర్ కాలనీలో సీసీరోడ్డుకు నోచుకోని మట్టిరోడ్లు

అచ్చంపేట టౌన్, జూలై 5: రోజు రోజుకు విస్తరిస్తున్న అచ్చంపేట పట్టణం ప్రధాన నగరాలకు పోటీగా రియల్ ఎస్టేట్‌తో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నది. ఇదిలా ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత ఇలాకా కావడంతో అభివృద్ధిలో దూకుడు పెంచుతుందన్న విశ్వాసం ప్రజల్లో నెలకొంది. అచ్చంపేట మునిసిపల్ పరిధిలో 20వార్డులకు గాను దాదాపు 30వేల మంది జనాభా ఉన్న పట్టణంలో ప్రస్తుతం మురుగు కాల్వలు, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మేజర్ గ్రామపంచాయతీ నుంచి నగరపంచాయతీ, ఇక్కడి నుంచి మునిసిపల్ స్థాయికి ఎదిగినా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, మునిసిపల్ భవనాల అద్దె, వెంచర్ల నుంచి వచ్చే 10శాతం ఆదాయం మునిసిపల్ సిబ్బంది, అధికారులు, కౌన్సిలర్ల వేతనాలకు మాత్రమే సరిపెట్టుకుంటున్నారు. అధికారులు, నాయకులు, మునిసిపల్ కౌన్సిలర్ల ఇళ్లముందే రోడ్లు, మురుగు కాల్వలు, వీధి దీపాలు ఏర్పాటు చేసుకున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. 2వ వార్డులో 1100 మంది జనాభా ఉండగా అందులో 900 మంది ఓటర్లు ఉన్నారు. అంతర్గత రహదార్లు, మురుగు కాల్వలు సరిగాలేక ఇళ్లలోనుంచి వచ్చే మురుగునీరు కాలనీల మధ్యనే మురుగునీటితో కుంటలను తలపిస్తున్నాయి. పందులు మురుగునీటిలో దోమలు అధికమై స్వైరవిహారం చేస్తున్నాయి. తాగునీటి సమస్య ప్రధానంగా మారింది. ప్రతిరోజు ఒక్కో బిందెకు రూ.10నుంచి రూ.15 వెచ్చించి ఫిల్టర్ నీటిని కొనుగోలు చేస్తున్నారు. మిషన్ భగీరథ, చంద్రసాగర్ నుంచి వచ్చే నీరు కూడా కాలనీకి రావడం లేదని కాలనీవాసులు వా పోతున్నారు. సొంత ఇళ్లు లేక కాలనీలో దాదాపు 25 కుటుంబాలు గుడారాల్లోనే నివాసం ఉంటున్నాయి. 2014 ఎన్నికల్లో కాలనీకి వచ్చిన నాయకులకు పలుమా ర్లు విన్నవించుకున్నా డబుల్‌బెడ్ రూంలు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. నాలుగున్నర సంవత్సరాలు గడిచినా కాలనీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకో లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇంతవరకు హామీలు నె రవేర్చడంలో నాయకులు అధికారులు విఫలమయ్యారని అంటున్నారు. మళ్లీ ఎన్నికల సమయంలోనే కన్పించి సమస్యలు పరిష్కరిస్తామంటారు. కాలనీలో ఎలాంటి అభివృద్ధి, సంక్షేమం జరుగలేదన్నారు. కాలనీలో దుర్గంధం వెదజల్లుతున్నది. దీంతో కాలనీల ప్రజలు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ రోగాల బారిన పడుతున్నామన్నారు.

వైద్యసిబ్బంది కూడా కాలనీలలో దోమల నివారణకు ఫాగింగ్‌కూడా చేయడంలేదని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణానికి అభివృద్ధి ఆమడ దూరంలో ఉందన్నారు. అధికారులు స్పందించి అభివృద్ధికి నోచుకోని కాలనీలలో అంతర్గత రహదార్లు, మురుగుకాల్వలు, నిర్మించి, కాల్వల్లో పేరుకపోయిన చెత్తచెదారం తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

● వాన వస్తే రోడ్లన్నీ బురదమయం



వానవస్తే చాలు రోడ్లు మొత్తం బురదమయంగా మారుతున్నాయి. అదేవిధంగా కొన్ని కాలనీలకు కనీసం డ్రైనేజీలు కూడా లేవు. రోడ్లపైనే మురుగునీరు పారుతుంది. అందమైన పట్టణంగా తీర్చిదిద్దాలంటే ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలి.

- సలేశ్వర్ గౌడ్, అచ్చంపేట

● అంతర్గత రోడ్లు వేయాలి



అచ్చంపేట కాలనీలో అంతర్గతరోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పాలకులు, అధికారులు మారినా రోడ్లు మాత్రం అలాగే ఉన్నాయి. వర్షాకాలం వస్తే చాలు రోడ్లు అన్నీ అధ్వానంగా మారుతున్నాయి. పాలకులు, మునిసిపల్ అధికారులు స్పందించి సీసీరోడ్లు వేయాలి.

- పవన్ కుమార్, అచ్చంపేట

బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి

- సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బాల్‌నర్సింహ, వర్ధం పర్వతాలు
- వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన



నాగర్‌కర్నూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 5: బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేసి నేరుగా సింగరేణికే కేటాయించాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బాల్‌నర్సింహ, వర్ధం పర్వతాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ, సీపీఎం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సింగరేణి బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థలను విచ్ఛిన్నం చేసి పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందని, అందులో భాగంగానే సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటుపరం చేయడానికి సిద్ధమైందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికే అనే ప్రాంతాల్లో గనులను ప్రైవేటుకు అప్పగించిన మోదీ ప్రభుత్వం తెలంగాణలోని మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి దగ్గర ఉన్న బొగ్గు గనులను వేలం వేయడానికి సిద్ధమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా దేశంలో నిరుద్యోగాన్ని పెంచి మత విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రలకు పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రశ్నించకపోవడం సిగ్గు చేటన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు హెచ్.ఆ నంద్‌జీ, కేశవులుగౌడ్, నాయకులు కృష్ణాజీ, లక్ష్మీపతి, సురేష్, సీపీఎం నాయకులు ఆర్.శ్రీనివాస్, రామయ్య, అశోక్, అంతటి కాశన్న, మధు, సత్యనారాయణ, శివరాం, సుభాష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రంను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు



కొల్లాపూర్‌లో కోట వీధి పీర్ల చావిడి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య

కొల్లాపూర్, జూలై 5 : మరో వారం రోజుల్లో ప్రారంభమయ్యే మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించేలా కొల్లాపూర్ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య వెల్లడించారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని కోటవీధిలో పీర్లచావిడి పరిసరాలను మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్ బరిగెల రాముడుతో కలిసి చైర్‌పర్సన్ పరిశీలించారు. పీర్లచావిడి పరిసరాల్లో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను తొలగించి మొహర్రం వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఏర్పాట్లు చేయాలని ఆమె మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కులమతాలకతీతంగా నిర్వహించే మొహర్రం వేడుకలను కొల్లాపూర్ మునిసిపాలిటీలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని వరిదెల పీర్ల చావిడి వద్ద కూడా భక్తులకు వసతులు కల్పించాలని ఆమె మునిసిపల్ అధికారులను ఆదేశించారు. మాజీ ఎంపీటీసీ బరిగెల రాముడు, గోపాల మల్లయ్య, రాంచందర్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే మంత్రి జూపల్లి లక్ష్యం

కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా మంత్రి జూపల్లి కృష్ణారావు పని చేస్తున్నారని ఆయన సహకారంతో కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టనున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను కౌన్సిలర్ పిన్నంశెట్టి జ్యోతిశేఖర్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌తో కలిసి ఆమె పాఠశాలలను పరిశీలించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే కేసు నమోదు చేస్తాం



ద్విచక్రవాహనాలు రిపేర్‌చేసే వారికి అవగాహన కల్పిస్తున్న ముస్కాన్ టీం సభ్యులు

కల్వకుర్తిటౌన్, జూలై 5 : చిన్నారులను పనిలోపెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తామని ముస్కాన్‌టీం ఎస్‌ఐ అంజయ్య అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని మెకానిక్ షెడ్లు, బట్టలదుకాణాలు, ఫర్నిచర్ దుకాణాలలోని యజమాలకు అవగహన కల్పించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండని బాలబాలికలను పనిలో పెట్టుకోవద్దని తెలిపారు. ఇందుకు విరద్ధంగా వారిని పనిలో పెట్టుకుంటే సదరు దుకాణం, యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి విషయాలు ఎవరూ ప్రోత్సహించవద్దని సూచించారు. అధికారులు సప్తగిరి, మధుబాబు, శ్రీనివాస్‌యాదవ్, చైల్డ్‌లైన్ ప్రమీల, ఏఎస్‌ఐ నర్సింహా, ఉమెన్ కానిస్టేబుల్ అరుణ, హెచ్‌కానిస్టేబుల్ పాండునాయక్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 5: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని కొల్లాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 8 లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ జి.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ(హెచ్‌ఈపీ) బీ.కం(బీఏ), బీ.కం(సీఏ) ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బీఎస్సీలో ఎంపీసీఎస్, ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్, బీజెడ్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రవేశాలు కోరే విద్యార్థులు నిర్దేశించిన తేదీలోగాఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో దరఖాస్తును సమర్పించాలని కోరారు.

9న గొర్రెలు, మేకల సంత వేలం

చారకొండ, జూలై 5: మండల కేంద్రంలో ఈనెల 9న ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో గొర్రెలు, మేకల సంత వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ స్పెషల్ అధికారి ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, పంచాయతీ కార్యదర్శి గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనే వారు ఈనెల 8వ తేది సాయంత్రం 4 గంటల వరకు చారకొండ గ్రామపంచాయతీ పేరున డిమాండ్ డ్రాఫ్ట (డీడీ) రూ. 50 వేలు చెలించి పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

● జూపల్లిలో..

మండలంలోని జూపల్లిలో ఈనెల 10న ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో గెర్రెలు, మేకలు సంత వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ స్పెషల్ అధికారి తహసీల్దార్ కేసీ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7వ తేది సాయంత్రం 4 గంటల వరకు గ్రామ పంచాయతీ జూపల్లి పేరున డిమాండ్ డ్రాఫ్ట (డీడీ) ద్వారా రూ. 50 వేలు చెల్లించి గ్రామ పంచాయతీ కార్యాలయలంలో అందజేయాలని వారు పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ ఏపీవో యాదమ్మ



గిరిజన విద్యార్థులకు నోటు బుక్కులు, బెడ్ షీట్లను పంపిణీ చేస్తున్న ఏపీవో యాదమ్మ

మన్ననూర్, జూలై 5: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గిరిజన వసతి గృహాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని ఐటీడీఏ ఏపీవో యాదమ్మ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. హాస్టల్లో వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూ వివరాలను హాస్టల్ వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటుబుక్కులు, కార్పేట్లు, టవల్స్, బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. వార్డెన్ రాజేందర్, హాస్టల్ వర్కర్లు ఓం ప్రకాశ్, మల్లయ్య, ఏడుకొండలు, కళమ్మ పాల్గొన్నారు.

కొరటికల్‌లో సోషల్ ఆడిట్



ఉపాధి హామీ పథకంలో భాగంగా సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పునుంతల, జూలై 5 : మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలో శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు గ్రామంలో చేసిన పనులపై 20లక్షల 677మెటీరియల్ 55,000కు సంబంధించిన పనులపై సోషల్ ఆడిట్ టీం తనిఖీలు చేసి శుక్రవారం గ్రామసభలో ఉపాధి కూలీలు ఈజీఎస్ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీల వివరాలు డీఆర్‌పీ అనిత వెల్లడించారు. చిన్న చిన్న పొరపాట్లు తప్ప ఎలాంటి అవకతవకలు లేవని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి లలిత, ఈజీఎస్ ఈసీ కురుమూర్తి, టీఏ జీవన్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, రఘుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకోవాలి



విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న భవాండ్ల మధు, ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి

కల్వకుర్తి, జూలై 5 : విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకోవాలని కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి కోరారు. సీఈసీలో రాష్ట్ర స్థాయిలో నాల్గవ ర్యాంకు సాధించిన ఆదిలక్ష్మీకి కల్వకుర్తి బీఆర్ఎస్ నాయకుడు భవాండ్ల మధు రూ.పదివేల నగదు ప్రోత్సాహకాన్ని శుక్రవారం ప్రిన్సిపాల్‌తో కలిసి భవాండ్ల మధు అందజేశారు. అధ్యాపకులు సదానందంగౌడఖ్, రమాకాంత్, మల్లేష్, మహబూబ్‌అలీ, రాజేష్, గిరిబాబు, పరుశరామ్, శ్రీనివాస్, లక్ష్మయ్య, సంతోష్‌గౌడ్, సిబ్బంది బాలయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవో శ్రీనుకు వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు

కల్వకుర్తిటౌన్, జూలై 5 : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కల్వకుర్తి ఆర్డీవో శ్రీనుకు శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సభ్యులు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ పెన్షన్ రూ.6వేలు అందజేయాలని, పురుష వికలాంగులకు బస్సు సౌకర్యం కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, 2016 వికలాంగుల రక్షణ చట్టం పటిష్ట అమలుకు కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వికలాంగుల పెన్షన్‌కు ఆదాయ పరిమితి విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 17ను ఉపసంహరించుకోవాలని, ప్రతీ నెల 5వ తేదీన పెన్షన్లు వేయాలని లేఖలో పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గౌతమ్, ప్రధానకార్యదర్శి బాలీశ్వర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, జూలై 5: మండలంలోని పోల్కంపల్లి సర్పంచ్ చెన్నయ్య మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శుక్రవారం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చెన్నయ్య మృతదేహంపై పులమాల వేసి నివాళి అర్పించారు. చెన్నయ్య మృతి ఆ కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు రమేష్‌గౌడ్, పండిత్‌రావు కుటుంబాన్ని పరామర్శించారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కల్వకుర్తి, జూలై 5 : వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం నిబంధనలు అతిక్రమిస్తూ వాహనాలు నడిపిన పలువురికి సీఐ బి.నాగార్జున ఆదేశాల మేరకు జరిమానాలు విధించినట్లు ఆయన పేర్కొన్నారు. మారిన చట్టాలకనుగుణంగా ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. ఓవర్ స్పీడ్, మైనర్లు డ్రైవింగ్ చేయడం, మద్యం తాగి వాహనాలు నడిపితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కళాశాలల వద్ద నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శిక్ష తప్పదని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటిన ఆర్డీవో



మొక్కలు నాటుతున్న అచ్చంపేట ఆర్డీవో మాధవి, తహసీల్దార్ తదితరులు

అమ్రాబాద్, జూలై 5: వన మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అచ్చంపేట ఆర్డీవో కె.మాధవి పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఈసందర్భంగా ఆర్డీవో కె. మాధవి తెలిపారు. తహసీల్దార్ వి.సరిత, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, ఆర్ఐ కృష్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ దందా

- ఆర్డీవోకు గ్రామస్థుల ఫిర్యాదు

లింగాల, జూలై 5 : మండల పరిధిలోని అంబటిపల్లి గ్రామ శివారులోని కేసీతాండాకు వెళ్లే మార్గంలో గల తురకగుట్ట నుంచి కొందరు అక్రమంగా మట్టిని తవ్వుకుని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమ దందాకు తెరలేపారు. వివరాల ప్రకారం.. సర్వే నెంబరు 406లో 5-15ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కొందరు అక్రమార్కులు మట్టి అక్రమ రవాణాకు తెరలేపారు. ఇట్టి భూమి నుంచి మట్టిని జేసీబీతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని సమాచారాన్ని అందిస్తూ గ్రామస్థులు ఆర్డీవో మాధవికి ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ ఉమా శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అధికారులు వస్తున్నారని గ్రహించిన అక్రమార్కులు మట్టిని తవ్వుతున్న జేసీబీని తప్పించినట్లు గుర్తించారు. రెండు ట్రాక్టర్లు మాత్రం సంఘటన స్థలంలోనే ఉన్నాయి.

మట్టి తరలింపుపై ఆర్డీవోను వివరణ కోరగా అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న సమాచారాన్ని అందుకున్న వెంటనే తహసీల్దార్ ఉమా సంఘటనస్థలానికి వెళ్లి పరిశీలించి రెండు ట్రాక్టర్ల తాళం చెవులను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.